నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

- నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్‌లు
- యువతకు ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం
- 18–35 ఏళ్ల లోపు యువతీ యువకులకు అవకాశం
- జిల్లాలో 8 స్కిల్ కాలేజీలు, స్కిల్ హబ్‌లో 480 మందికి శిక్షణ
- అవకాశాలను అంది పుచ్చుకునేలా తర్ఫీదు
- నిరుద్యోగులకు సదావకాశం

నిరుద్యోగులను నైపుణ్య వంతులుగా మార్చి ఉపాధి అవకాశాలు పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ప్రతి నియోజకవర్గం కేంద్రంలో స్కిల్ హబ్‌ను, జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజీని ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తుంది. ఇందులో 8వ తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన అభ్యర్థులకు వారి ఆసక్తిని బట్టి నిర్ణయించిన కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తుంది. వివిధ ప్రాంతాల్లో జరిగే క్యాంపస్ సెలక్షన్స్‌లో అక్కడికి వీరిని పంపి ఉద్యోగులు అందుకునేలా తోడ్పాటునందిస్తోంది.



కంప్యూటర్ హార్డ్‌వేర్‌పై శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): నైపుణ్యం అంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు.. అందరిలో ప్రత్యేకత చాటవచ్చు.. చదువుకొని తగిన ఉపాధి పొందలేని యువత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తుంది. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చునని భావించిం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను, జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజీని ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య నివారణకు కృషి చేస్తుంది. 8వ తరగతి చదివిన అభ్యర్థుల నుంచి బీటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన అభ్యర్థుల వరకు వారి ఆసక్తిని బట్టి నిర్ణయించిన కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. నంద్యాల జిల్లాలోని 8 స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేయగా స్కిల్ హబ్‌లను నంద్యాల, బనగానపల్లె, పాణ్యం, డోన్, శ్రీశైలం, నందికొట్కూరు, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లాలో స్కిల్‌హబ్‌లు గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి అన్ని నియోజకవర్గాల పరిధిలో 420 మంది శిక్షణ పొందగా వీరిలో 300 మందికి ఉద్యోగాలు లభించాయి.

కోర్సులు..

18 –35 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇస్తున్నారు. 8– 10వ తరగతి ఉత్తీర్ణత గల వారికి టైలరింగ్, ఎలక్ట్రికల్ డెమోస్టిక్, సొల్యూషన్స్, అసిస్టెంట్ డెకరేటివ్, పెయింటర్ తదితర కోర్సుల్లో ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న వారికి డేటా ఎంట్రీ ఆపరేటర్, జావా, ఎంఎస్ ఆఫీసు, మైక్రోసాఫ్ట్, ఎలక్ట్రీషియన్ వర్క్, కస్టమర్‌కేర్ ఎగ్జిక్యూటివ్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, హోం,హోల్త్ ఎయిడ్ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీసు అసోసియేట్, జూనియర్ సాఫ్ట్‌వేర్, డెవలపర్ తదితర కోర్సుల్లో నిర్ణీత కాలం పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేస్తారు. ఈ సమయంలో క్యాంపస్ సెలక్షన్లు ఎక్కడైనా జరుగుతుంటే అర్హత, ఆసక్తి ఉన్న వారిని పంపించి ఉద్యోగాలు అందుకునేలా చేస్తున్నారు. కోర్సును బట్టి కాల వ్యవధి ఉంటుంది. స్కిల్ హబ్‌లో రోజుకు నాలుగైదు గంటలు, స్కిల్ కాలేజీలో 8గంటల పాటు శిక్షణ ఇస్తున్నారు.

రెండు నెలల పాటు శిక్షణ



నంద్యాలలోని ఎస్‌వీఆర్ కళాశాలలో స్కిల్ కాలేజీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నాం. కామన్ ప్రొడక్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పర్యవేక్షణలో నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. జనవరిలో ప్రారంభమైన ఈ సెంటర్‌లో ఇప్పటి వరకు టైలరింగ్‌లో 30 మందికి, స్కిల్ హబ్‌లో 30 మందికి, డేటా ఎంట్రీలో 30 మందికి శిక్షణ ఇస్తున్నాం. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.

–ప్రతాపరెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, నంద్యాల

పరిజ్ఞానం అవసరం



నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సుల్లో రెండు నెలలుగా శిక్షణ తీసుకున్నా. ఇంటర్వ్యూకు కావాల్సిన కమ్యూనికేషన్ స్కిల్స్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన కోర్సును రెండు నెలల పాటు నేర్చుకున్నా. స్కిల్‌హబ్‌లో టైలరింగ్ శిక్షణ పొందాను.

–హైమావతి, నంద్యాల

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం



నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ కోర్సులు మొదలవుతున్నాయి. కంప్యూటర్ హార్డ్‌వేర్, ఐటీ టెలీ కోర్సులు, ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన నిరుద్యోగులు కళాశాలకు వచ్చి నమోదు చేసుకోవాలి. శిక్షణ అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.

– మస్తాన్‌వలి, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్, నంద్యాల

క్లుప్తంగా

పంటల నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

చాగలమర్రి: పంటనష్ట పరిహారం, పంటల బీమా, మద్దతు ధర తదితర వాటికి రైతులు అర్హులు కావాలంటే సాగు చేసిన పంటలను కచ్చితంగా నమోదు చేయించాలని(ఈక్రాప్ నమోదు) ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా సంఘం, ఆర్బీకే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ రంగ నేతాజీ, ఏఈఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించండి

నంద్యాలటౌన్: ఆశ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి కోరారు. శుక్రవారం వారు డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో 16 రకాల యాప్‌లలో డేటా నమోదు చేయడానికి 4జీ నెట్ అందించి, సిమ్ కార్డులు అందజేయాలని, మెడికల్ లీవులు, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని కోరారు. డీఎంఅండ్‌హెచ్ఓను కలిసిన వారిలో ఆశ వర్కర్స్ జిల్లా నాయకురాలు షమీమ్, వర్కర్లు నాగలక్ష్మి, శిరోమనమ్మ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం



వెంకటేశ్వర్లు(ఫైల్)

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తోటలైన్ వీధి పురపాలక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల వెంకటేశ్వర్లుకు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో అమలవుతున్న సర్వశిక్ష అభియాన్ కార్యక్రమంపై శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ డాక్టర్ గోవిందరెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గానూ తనకు ఆర్‌యూ డాక్టరేట్ ఇచ్చిందని శుక్రవారం వెంకటేశ్వర్లు తెలిపారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ



అమ్మవారికి సారెను సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): జగజ్జననీ మాతకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని చివరి శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో సారెను సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ప్రతిమతో సారెను సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

శాఖాంబరిగా వాసవీ మాత





నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారి శాలలో చివరి శుక్రవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం వాసవీ మాత, వింధ్యావాసిని అమ్మవార్లను శాఖాంబరి దేవిగా అలంకరించారు. అమ్మవార్లకు తెల్లవారుజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి, వివిధ కూరగాయలు, ఆకుకూరలచే అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. వాసవీ మహిళా మండలి సభ్యురాలు ఇందుమతి, శోభారాణి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

సురక్ష సదస్సును విజయవంతం చేయండి

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో శనివారం నిర్వహించనున్న జగనన్న సురక్ష సదస్సును విజయవంతం చేయాలని జెడ్పీటీసీ లక్ష్మీదేవి సూచించారు. శుక్రవారం ఆమె సచివాలయ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఎంపీటీసీ రాజేశ్వరి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో శనివారం జరగనున్న జగన్న సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ సుబ్బారెడ్డి శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న 11 రకాల ధ్రువ పత్రాలకు గానూ ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారని ఆరా తీశారు. సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని, ఈ విషయాన్ని వలంటీర్లు తమ పరిధిలోని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

సచివాలయ సేవలు

ప్రాణాలకు తెగించాడు



నర్సాపురంలో కరోనా బాధితుడు రామాంజనేయులుతో ఈ-కేవైసీ చేయిస్తున్న వలంటీర్ మోహన్

ఈ చిత్రంలో ఈ-కేవైసీ **చే**యించుకుంటున్న వ్యక్తి పేరు రామాంజనేయులు. హైదరాబాదలో ఉద్యోగం చేసుకుంటున్న ఇతను కరోనా సమయంలో స్వగ్రామం రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి వచ్చాడు. గ్రామానికి వచ్చే సమయంలో బస్టాండులో పరీక్ష చేసిన అధికారులు ఇతనికి కరోనా సోకిందని మెసేజ్ పంపించారు. దీంతో గ్రామస్తులందరూ కలిసి అతన్ని గ్రామంలో ఉండొద్దని తీర్మానించడంతో గ్రామ శివారులోని చెట్టు కింద పట్టలతో గుడిసె వేసుకుని ఉండిపోయాడు. ఆ సమయంలో ఎవరూ అటువైపు వచ్చేవారు కాదు. ఈ క్రమంలో వలంటీర్ మోహన్ ధైర్యంగా ఆయన వద్దకు వెళ్లి నిత్యం వస్తూ యోగ క్షేమాలు తెలుసుకుంటూ అవసరమైన మందులు అందించడంతో పాటు తనకు అవసరమైన ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడంతో బాధితుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వలంటీర్‌ను అభినందించారు.

నాడు..ఎవరూ పట్టించుకోలేదు..



కరోనా సమయంలో నన్ను గ్రామంలోకి రానివ్వలేదు. దీంతో ఊరి బయట పట్టలతో గుడిసె వేసుకొని ఉండిపోయా. అప్పుడు వలంటీర్ మోహన్ ఒక్కడే ధైర్యంగా నా వద్దకు వచ్చి ఆరోగ్యం గురించి తెలుసుకుంటూ అవసరమైన మందులు అందజేశాడు. కరోనాకు సంబంధించి ఈ కేవైసీ చేయించాలని చెప్పడంతో ప్రాణాలకు తెగించి వేలి ముద్ర వేయించుకొని మిషన్‌ను శానిటైజ్ చేశాడు. ప్రాణాల మీదకు వస్తుందంటే ఎరవైనా ముందుకొచ్చి సేవలు చేస్తారా.. కానీ మా వలంటీర్ వచ్చి చేశాడు. ఆయన మేలు ఎన్నటికీ మరువలేను.

– రామాంజనేయులు, నర్సాపురం

ఆపద్బాంధవుడు..



నరసింహునికి పింఛన్ అందిస్తున్న వలంటీర్(ఫైల్)

మూడు చక్రాల బండిలో ఉన్న ఈ వ్యక్తి బంధం నరసింహుడు. నంద్యాల మండలం చాబోలు గ్రామం. 2015లో వాహన ప్రమాదంలో కాళ్లు విరిగిపోయాయి. అప్పటి నుంచి మూడు చక్రాల బండికే పరిమితమయ్యాడు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా గత ప్రభుత్వాలు మంజూరు చేయకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆపద్బాంధవుడిలా వలంటీర్ గుర్రప్ప.. నరసింహులు ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తు చేయించాడు. పింఛన్ మంజూరు కావడంతో ప్రతినెలా రూ.3 వేల చొప్పున ఒకటో తారీఖునే అందుకుంటున్నాడు.

ఇక రాదనుకున్నా..



గతంలో దరఖాస్తు చేసుకున్నా పింఛన్ ఇవ్వలేదు. అందుకే ఇంక రాదులే అనుకున్నా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ గుర్రప్ప మా ఇంటికి వచ్చి వివరాలు తీసుకున్నాడు. కొద్దిరోజులకే పింఛన్ మంజూరైంది. 2020 జనవరి ఒకటో తారీకు నుంచి ఇప్పటి వరకు ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే గుర్రప్ప మా ఇంటికే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నాడు. చాలా సంతోషం. అతని సాయం మరిచిపోలేను.

– నరసింహులు, చాబోలు, నంద్యాల మండలం

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఆళ్లగడ్డ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న కార్యకర్తలు



రుద్రవరంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి ఫొటోతో ఏర్పాటు చేసిన కేక్

ఆళ్లగడ్డ/రుద్రవరం/శిరివెళ్ల/దొర్నిపాడు/చాగలమర్రి: ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆళ్లగడ్డలో నాయకులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. రుద్రవరం మండలం ఆలమూరులో సర్పంచు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాణ్యం నాగేష్ తదితరులు ఎమ్మెల్యే ఫొటోతో తయారు చేయించిన కేక్‌ను కట్ చేసి, బాణాసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. శిరివెళ్లలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం ఆధ్వర్యంలో, దొర్నిపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తుల క్రిష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో, చాగలమర్రిలో ఎంపీపీ వీరభద్రుడు, ఏపీ స్టేట్ మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్.బాబులాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గోస్పాడు మండలం యాళ్లూరులో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జన్మదిన వేడుకలు నాని యూత్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మెరుగైన సేవలందించాలి



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసులు విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలు అందిచాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎస్పీ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలిగినా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల నుంచి వచ్చిన సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

డ్రైడేతో పట్టణ పరిశుభ్రత

నంద్యాల(అర్బన్): మున్సిపల్ కార్మికులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే డ్రైడే కార్యక్రమంతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. పట్టణంలోని పొన్నాపురం కాలనీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను అసిస్టెంట్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ప్రతిగడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: నవరత్నాల పథకాలతో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందినట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మార్కెట్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి శుక్రవారం మండలంలోని జూలేపల్లె గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అందుతున్నాయా లేదా అని వారు ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.23 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, మురుగు కాలువ, రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన సచివాలయ భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమన్, సర్పంచ్ పుల్లయ్య, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, కాంతారెడ్డి, మాజీ సర్పంచ్ పార్థసారథరెడ్డి, రామనాథరెడ్డి రామసుబ్బారెడ్డి, వంగూరి భాస్కర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

కొండంపల్లిలో క్షుద్ర పూజల కలకలం

ఆళ్లగడ్డ: రూరల్ మండలం కొండంపల్లెలో శుక్రవారం క్షుద్ర పూజలు కలకలం రేపాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని వ్యవసాయ పొలంలో ఇద్దరు అన్నదమ్ముల పొలం గట్టు మధ్యలో గుంత తీసి అందులో ఏదో పూడ్చి పెట్టారు. ఆపై పసుపు, కుంకుమ చల్లి నిమ్మకాయను కోసి వప్పలను పడేశారు. క్షుద్ర పూజలు ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్తులు పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించి వెళ్లారు. కాగా ఇది ఎవరిపైనైనా క్షుద్ర పూజలు చేశారా లేక అక్కడ ఏదైన నిధి ఉందని గుంత తీసి పూడ్చి పెట్టారా అని చర్చించుకుంటున్నారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్ కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం మొక్కజొన్న కంకులు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుః కాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పెద్ద ఎత్తున అమ్మవారికి భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా చీర, సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల బంద్ విజయవంతం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో అన్ని ప్రైవేట్ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు ప్రభుత్వం నిర్ణయించిన తక్కువ ఫీజుకు డిగ్రీ కళాశాలలు నడపడం కష్టతరమైందని, ఫీజు పెంచాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

జగనన్న సురక్ష పేదలకు వరం



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



పేరూరులో లబ్ధిదారునికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): జగనన్న సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని నూనెపల్లె వాటర్ ట్యాంకు, పొన్నాపురంలలో వార్డు కౌన్సిలర్లు రాజ్యలక్ష్మి, పరుచూరి నారాయణమ్మల అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష సదస్సులలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పాల్గొని పలువురికి సర్టిఫికెట్లు అందజేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అలాగే ఏదైనా అవసరమైన సర్టిఫికెట్లు పైసా ఖర్చు లేకుండా తక్కువ సమయంలోనే అందజేస్తున్నామన్నారు. ఈ సదస్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ తోడుగా ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జేసీఎస్ పట్టణ కన్వీనర్ నన్నల సాయిరాంరెడ్డి, పొన్నాపురం వార్డు శ్రీరాములు, నూనెపల్లె వార్డు ఇన్‌చార్జ్ పార్థసారథి, టైలర్ శివ, తిక్కన్నగౌడ్, శిల్పా రమణగౌడ్, శివకుమార్, నరసింహులు, జంబులయ్య, నాగేశ్వరరెడ్డి, మద్దిలేటి, రాజు, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- పట్టణంలోని 17, 18, 20 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని రామాలయంలో నిర్వహించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు సుబ్బలక్ష్మి, దేశం సులోచన, మురళీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. సాంకేతిక కారణాల రీత్యా ఎవరైనా అర్హత ఉండి పథకాలకు దూరంగా ఉండకూడదన్న లక్ష్యంతో సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీ ఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, మెప్మా పీడీ వెంకటదాసు, సీఎంఎం భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, లోకేష్, చంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఎంతో ఉపయోగం

రుద్రవరం: జగనన్న సురక్ష అనే కార్యక్రమం ఎంతో ఉపయోగ కరమైనదని గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరు ఆ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవా లని తహసీల్దారు రవీంద్ర ప్రసాదు అన్నారు.మండల పరిధిలోని పేరూరులో వివిధ శాఖల అధికారులు శుక్రవారం సర్పంచు కోనేటి దేవదానం అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఆ క్యాంప్‌లో కుల, ఆదాయ, రైస్ కార్డులు వంటి వాటికి సంబంధించిన ధృవ పత్రాలను తహసీల్దారుతో పాటు ఎంపీ డీఓ మధుసూదనరెడ్డి, వ్యవసాయాధికారి శ్రీకృష్ణ,నాయకులు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి అందేలా చేయడంతో పాటు 11 అంశాలకు సంబంధించిన ధ్రువపత్రాలను త్వరితగతిన అందజేసేందుకు జగనన్న సురక్ష ఎంతగానో ఉపయోగపడుతోందని ప్రజలకు వివరించారు.

నేడు ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రత్యేక సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్‌ఏఆర్‌ఎస్)లో శనివారం ట్రైనింగ్ అండ్ విజిట్ (టీఅండ్‌వీ) ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఆర్‌ఏఆర్‌ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఆర్) వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ అధికారులు హాజరుకానున్నారు. ఈ నెల చివరిలోపు వర్షాలు పడకపోతే చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చిస్తారు.

ట్రిపుల్‌ఐటీకి ఎంపిక

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. నంద్యాల జిల్లా నుంచి విద్యార్థులు కె.నవీన్‌కుమార్, ఎస్.వంశీ, జి.వెంకటేష్, ఎమ్.వినయ్‌కుమార్, జి.రామకృష్ణ, ఎ.సుమంత్, కె.ఉమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బీసీ గురుకుల పాఠశాలలో ప్రధానాచార్యులు బండ్లమూడి జవహర్ విద్యార్థులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని డి1, డి2, డి3 పరిధిల్లోని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ ఆంథోనిరాజు శుక్రవారం తెలిపారు. లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతులు, రహదారిల్లోని చెట్ల తొలగింపు తదితర పనుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రహదారిని పునః ప్రారంభించాలి

నంద్యాల(న్యూటౌన్): నూనెపల్లె ఓవర్‌బ్రిడ్జి కింద బ్లాక్ చేసిన రైల్వే పట్టాల వద్ద రహదారిని పునఃప్రారంభించాలని సీపీఐ నాయకులు ప్రసాద్, సోమన్న అన్నారు. శుక్రవారం వారు బ్లాక్ చేసిన పట్టాల వద్ద నిరసన తెలిపారు. ఓవర్ బ్రిడ్జి కింద చిరువ్యాపారులు, విద్యార్థులు, కాలినడకన వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్లాక్ చేసిన రహదారిని పునఃప్రారంభించాలని కోరారు.